# గుంటూరా... బందరా..

## బాలశౌరి ఎక్కడి నుంచి పోటీ?

### - వైకాపాకు రాజీనామా చేసిన ఎంపీ బాలశౌరిజిల్లాలో మారుతున్న రాజకీయ సమీకరణాలు



అమరావతి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉమ్మడి గుంటూరు జిల్లాలో రాజకీయ సమీకరణలు ఊపందుకున్నాయి. జిల్లాకు చెందిన బాలశౌరి కృష్ణా జిల్లా మచిలీపట్నం ఎంపీగా వైకాపా తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అత్యంత సన్నిహితుడైన బాలశౌరి అనూహ్యంగా శనివారం ఆ పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ పరిణామం రాజకీయంగా చర్చనీయాంశమైంది. దీంతో ఉమ్మడి జిల్లా పరిధిలో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి. ఆయన బందరు నుంచి బరిలోకి దిగుతారా? లేదా సొంతూరు గుంటూరుపై గురిపెట్టారా? అన్న చర్చ జోరుగా సాగుతోంది. ఏది ఏమైనా ఆయన రాజీనామా వైకాపాను కుదిపేసినట్లయింది. మరోవైపు కార్యకర్తలు సైతం బాలశౌరి రాజీనామాను జీర్ణించుకోలేకపోతున్నారు. వ్యాపారవేత్తగా స్థిరపడిన బాలశౌరి 2004లో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని తెనాలి పార్లమెంటుకు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి తెదేపా అభ్యర్థి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుపై విజయం సాధించారు. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా తెనాలి రద్దు కావడంతో ఆయన నరసరావుపేట నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి తెదేపా అభ్యర్థి మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. వైఎస్ కుటుంబానికి అత్యంత విధేయుడిగా ఉన్న బాలశౌరి రాష్ట్ర విభజన తర్వాత వైకాపా తీర్థం పుచ్చుకున్నారు. 2014లో గుంటూరు పార్లమెంటు నుంచి వైకాపా తరఫున పోటీచేసి తెదేపా అభ్యర్థి గల్లా జయదేవ్ మీద ఓడిపోయారు. రెండుసార్లు వరుసగా జిల్లాలో ఓటమి చెందిన ఆయన 2019 ఎన్నికల్లో కృష్ణా జిల్లా మచిలీపట్నం పార్లమెంటుకు పోటీచేసి తెదేపా అభ్యర్థి కొనకళ్ల నారాయణరావుపై విజయం సాధించారు. మొత్తం నాలుగుసార్లు పార్లమెంటుకు పోటీచేయగా రెండుసార్లు ఓటమిపాలై, రెండుసార్లు గెలుపొందారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో మచిలీపట్నం స్థానం నుంచి బాలశౌరి పేరు వైకాపా పరిశీలనలో లేకపోవడంతో ఆయన తీవ్ర అసంతృప్తికి గురయ్యారని తెలుస్తోంది. ఆ పార్టీ అధిష్ఠానానికి అత్యంత ఆప్తుడు, దిల్లీలో వైకాపా తరఫున కార్యకలాపాలు చక్కబెడుతూ కీలకపాత్ర పోషించారు. గత కొద్ది కాలం నుంచి ముఖ్యమంత్రి జగన్ తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని బాలశౌరి అనుచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తూ వస్తున్నారు. వైకాపాకు రాజీనామాతో ఆ పార్టీతో బంధాన్ని తెంచుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని రద్దయిన తెనాలి, ప్రస్తుతం ఉన్న గుంటూరు, నరసరావుపేట పార్లమెంటు స్థానాల నుంచి పోటీచేసిన సీనియర్ నేత కావడంతో అందరితో విస్తృత పరిచయాలున్నాయి. బాలశౌరి మరోసారి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించేందుకు జనసేన ద్వారా ప్రయత్నిస్తారా? లేదా కృష్ణా జిల్లాలోని బందరు నుంచి పోటీ చేస్తారా? అన్న మీమాంస కొనసాగుతోంది. ఆయన పవన్ కల్యాణ్‌ను కలిసిన తర్వాతే అన్ని వివరాలు వెల్లడిస్తానని ప్రకటించారు. మరోవైపు తెదేపా, జనసేనల మధ్య పొత్తు ఖరారైనందున సీట్ల సర్దుబాటులో భాగంగా బాలశౌరికి ఎక్కడి నుంచి అయిదోసారి అవకాశం లభిస్తుందో వేచి చూడాల్సిందే.

# నిరుద్యోగులకు సీఎం సంక్రాంతి కానుక

### - పండుగ తరువాత డీఎస్సీ నోటిఫికేషన్

### - విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి

### - ఇప్పటికే జిల్లాల్లో ఉపాధ్యాయ ఖాళీలపై నివేదిక



విశాఖపట్నం: రాష్ట్రంలో టీచర్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం సంక్రాంతి కానుక ప్రకటించింది. పండుగ తరువాత డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. విశాఖ ఎయిర్‌పోర్టులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగాల భర్తీ, విధి విధానాలను త్వరలో ప్రకటిస్తామన్నారు. సీఎం జగన్ ఎన్నికలకు ముందు ఏ హామీలిచ్చారో వాటన్నింటినీ తూచా తప్పకుండా అమలుచేశారని ఆయన గుర్తుచేశారు. ప్రజాసంకల్ప యాత్రలో ప్రజల సమస్యలను అతి దగ్గరగా చూసి వాటిని వంద శాతం అమలుచేసి దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు సృష్టించారన్నారు. మహానేత వైఎస్సార్ హయాంలో ఏపీ అభివృద్ధి బాటపడితే.. ఇప్పుడాయన తనయుడు జగన్ హయాంలో అంతకు రెట్టింపు అభివృద్ధి, సంక్షేమం ఏపీలో జరిగిందన్నారు.

**మూడు నెలల క్రితమే వివరాల సేకరణ**

మరోవైపు.. అన్ని జిల్లాల్లోను వివిధ మేనేజ్‌మెంట్లలో ఉన్న ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను అందించాలని మూడునెలల క్రితమే డీఈఓలు, ఆర్జేడీలకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేసి, వివరాలు సేకరించింది. డైరెక్ట్ నియామకాలకు అనుగుణంగా పోస్టుల రోస్టర్ రిజిస్టర్లతో సహా సమగ్ర సమాచారాన్ని డీఎస్సీ నోటిఫికేషన్ సూచించిన ప్రొఫార్మాలో తీసుకున్నారు. అన్ని అంశాలను క్రోడీకరించి, ఖాళీల ఆధారంగా ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వనుంది.

**డీఎస్సీ ప్రకటన హర్షణీయం..**

ఇక ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనుండటంపై ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. నిరుద్యోగుల ఎదురుచూపులకు మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటన ఎంతో ఊరటనిచ్చిందన్నారు.

# ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ పదవికి కొమ్మినేని శ్రీనివాసరావు రాజీనామా



విశాఖపట్నం: సీఆర్ ఏపీ మీడియా అకాడమీ(సీ రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ) చైర్మన్ పదవికి సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు రాజీనామా ప్రకటించారు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు ఒక ప్రకటనలో స్పష్టత ఇచ్చారాయన. తనపై నమ్మకంతో మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమించి.. పూర్తి సహాయ సహకారాలు అందించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారాయన. సీనియర్ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు.. 2022 నవంబర్ 10వ తేదీన ఏపీ మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ 13 నెలల 15 రోజులు కాలంలో వర్కింగ్ జర్నలిస్టుల కోసం పలుకార్యక్రమాలు చేయగలగడం సంతృప్తినిచ్చిందని ప్రకటనలో పేర్కొన్నారాయన. అయితే.. ఈ నెల 16 వరకు సంక్రాంతి నేపథ్యంలో సెలవులు ఉండడంతో.. 17 వ తేదీ నుంచి తన రాజీనామా అమలులోకి వస్తుందని ఆయన వెల్లడించారు. ఇక సీఆర్ ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ హోదాలో అందించిన సేవల్ని ఆయన గుర్తు చేసుకున్నారు. గ్రామీణ, పట్టణ జర్నలిస్టులు, జర్నలిజం పై అభిరుచి కలిగిన వ్యక్తుల కోసం మీడియా అకాడమీ ఆధ్వర్యంలో "జర్నలిజం లో డిప్లమో" కోర్సును నాగార్జున యూనివర్సిటీ సహకారంతో పూర్తి చేయడం తమకు అత్యంత సంతృప్తినిచ్చిన విషయంగా చెప్పారాయన. అదేవిధంగా, డిప్లమో కోర్సు తో పాటుగా, ప్రతి శనివారం వర్కింగ్ జర్నలిస్టులకోసం సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాల పై ఆన్ లైన్ శిక్షణ తరగతులు నిర్వహించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి, ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన పాలనా సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు పత్రికా ముఖంగా ప్రజలకు వివరించగలిగామని ఆయన పేర్కొన్నారు. అనంతపురం నుంచి ఉద్దానం (శ్రీకాకుళం జిల్లా) వరకు జరిపిన పర్యటనల్లో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, వంటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల అభివృద్ధిని, ఉద్దానం కిడ్నీ వ్యాధుల పరిశోధనా కేంద్రం వంటి అభివృద్ధిని స్వయంగా పరిశీలించి ప్రజలకు మీడియా ద్వారా వివరించగలిగామని ఆయన తెలిపారు. ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా తో పాటు సోషల్ మీడియాను కూడా సమాచార చేరవేతలో భాగస్వామిని చేయగలిగామన్నారు. తమ పదవీ కాలంలో సహకరించిన మీడియా మిత్రులందరికీ, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఆ ప్రకటనలో కొమ్మినేని శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

# చీరల దొంగలను పట్టించిన ఉప ముఖ్యమంత్రి కుమార్తె



పటమట : వస్త్ర దుకాణంలో చీరలు దొంగిలించిన ఓ ముఠాను ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి పోలీసులకు పట్టించారు. కృపాలక్ష్మి శనివారం విజయవాడ బందరు రోడ్డులోని ఓ వస్త్ర దుకాణానికి చీరలు కొనేందుకు వెళ్లారు. ఆమె చీరలు చూస్తున్న సమయంలో అయిదుగురు మహిళలు వచ్చి ఖరీదైన చీరలు చూపించాలని సేల్స్‌మన్‌ని అడిగారు. ఈ క్రమంలో బాగా హడావుడి చేసి నాలుగు చీరలను దొంగిలించారు. ఆ సన్నివేశాన్ని దుకాణ యాజమాని ఇంటినుంచి సెల్‌ఫోన్‌లో సీసీ కెమెరా ఫుటేజీలో చూసి, తమ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఆ మహిళలకు దగ్గర్లోనే ఉన్న కృపాలక్ష్మి అప్పటికే ఈ విషయం గమనించి పోలీసులకు ఫోన్ చేశారు. అంతేకాకుండా దొంగతనానికి వచ్చిన ఓ మహిళను పారిపోనివ్వకుండా అడ్డుకున్నారు. ఇంతలో దుకాణానికి చేరుకున్న సీఐ గుణరాము పట్టుబడిన మహిళను అదుపులోకి తీసుకుని విచారించగా మిగిలిన వారి సమాచారం లభించింది. ఆ అయిదుగురు మహిళలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

# స్టాంప్ పేపర్‌పై సంతకం పెడుతున్నా..

### - దమ్ముంటే నా సవాల్ స్వీకరించండి



అనంతపురం: తనపై వచ్చిన ఆరోపణలపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. రాప్తాడు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పరిటాల సునీత జీర్ణించుకోలేకపోతున్నారని మండిపడ్డారు. కొడిమి జగనన్న కాలనీలో కార్మికులను కిడ్నాప్ చేశారంటూ తనపై వచ్చిన ఆరోపణలను కొట్టిపారేశారు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి.. అనంతపురం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాప్తాడు నియోజకవర్గం కొడిమి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం కోసం శాన్వి – లోటస్ సంస్థల మధ్య ఒప్పందం జరిగిందని ఆయన వివరించారు. పేదలకు ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి అయ్యేలా తాను చర్యలు తీసుకున్నానని చెప్పారు. శాన్వి సంస్థ నుంచి 55 లక్షల రూపాయలు అడ్వాన్స్ గా తీసుకున్న లోటస్ సంస్థ ప్రతినిధులు పనులు చేయకుండా వెళ్లిపోయారని తెలిపారు. శాన్వి సంస్థ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు పోలీసులు కలకత్తా కార్మికులను అదుపులోకి తీసుకున్నారని.. దీనిపై టీడీపీ నేత పరిటాల శ్రీరామ్, సీపీఐ నేత రామకృష్ణ, ఎల్లో మీడియా అసత్య ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి మండిపడ్డారు. తప్పుడు ప్రచారం చేసే వారిపై పరువు నష్టం దావా వేస్తానని ఆయన స్పష్టం చేశారు. తనకు రెండు వేల కోట్ల రూపాయల అక్రమాస్తులు ఉన్నాయని చంద్రబాబు ఆరోపించారని.. 500 కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నాయని కథనాలు వచ్చాయని.. తనకు 50 కోట్లు ఇస్తే తన ఆస్తులు రాసిస్తానని ఆయన మీడియా ఎదుట వంద రూపాయల స్టాంప్ పేపర్ పై సంతకం చేసి సవాల్ విసిరారు.

# 108, 104 ఉద్యోగుల సమ్మె లేదు

- ఫలించిన ప్రభుత్వ చర్యలు.. సమ్మె నిర్ణయం వెనక్కి - ఉద్యోగులతో మంత్రి రజిని చర్చలు సఫలం
- 108, 104 ఉద్యోగులను ఆప్కాస్‌లో చేర్చాలనే వినతిని సీఎం జగన్ దృష్టికి తీసుకెళతాం
- ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజిపైనా ప్రతిపాదనలు ఇస్తాం
- శ్లాబ్ పద్ధతిని వెంటనే అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం
- మంత్రి హామీలకు ఉద్యోగుల అంగీకారం.. సమ్మె నిర్ణయం వెనక్కి




అమరావతి గుంటూరు: రాష్ట్రంలో 108, 104 ఉద్యోగులు సమ్మె యోచనను విరమించుకున్నారు. 108, 104 ఉద్యోగ సంఘాల నాయకులతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని శనివారం గుంటూరులో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. తమ సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించారని, ఈ నెల 22 నుంచి జరపతలపెట్టిన సమ్మెను విరమించుకుంటున్నట్లు సంఘాల నేతలు ప్రకటించారు.

**వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఉద్యోగులకు గుర్తింపు, గౌరవం: మంత్రి రజిని**

ఈ చర్చల్లో ఉద్యోగుల డిమాండ్లపై మంత్రి రజిని ఉద్యోగ సంఘాల నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు తగిన గుర్తింపు, గౌరవం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే దక్కాయని వివరించారు. 108, 104 వాహనాల ఉద్యోగులను ఆప్కాస్‌లో చేర్చాలనే వినతిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామని చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజిపైనా ప్రతిపాదనలు తయారు చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులు కోరుతున్నవాటిలో ప్రధానమైన శ్లాబ్ పద్ధతిని వెంటనే అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ప్రతినెలా క్రమం తప్పకుండా ఉద్యోగులకు వేతనాలు అందిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో 104, 108 ఉద్యోగుల జీతాలను సమయానికి ఇచ్చేవారు కాదని గుర్తు చేశారు. ఇకపై కూడా ప్రతి నెలా మొదటి వారంలోనే ఉద్యోగులందరికీ జీతాలు అందేలా కృషి చేస్తామన్నారు.

సీఎం జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా 104, 108 వ్యవస్థను, వాహనాలను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని, ఈ విభాగాల్లోని ఉద్యోగులకు కూడా ఏ సమస్యలు రానీయరని తెలిపారు. అత్యవసర సేవలు అందించే విషయంలో 108 సిబ్బంది చేస్తున్న కృషి ఎంతో గొప్పదని చెప్పారు. 104, 108 ఉద్యోగులకు అండగా ఉంటామని, ఏ సమస్యలున్నా మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని సూచించారు.

సీఎం జగన్ ప్రభుత్వం ఎక్కడా రాజీ పడకుండా ప్రజలకు ఎలా సేవ చేస్తోందో, ఉద్యోగులకు కూడా ఏ సమస్యలూ రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. మంత్రి హామీలకు ఉద్యోగుల సంఘం నేతలు అంగీకరించారు. ఈ సమావేశంలో 108 ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎన్.మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.శ్రీనివాసరావు, 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.ఫణికుమార్, ఉపాధ్యక్షుడు రాంబాబు, అరబిందో సంస్థ నుంచి ఎంవీ సత్యనారాయణ, రాకేష్ పాల్గొన్నారు.

# ఆ భరోసాతోనే ప్రతి ఇంటా సంక్రాంతి

### - సీఎం జగన్ పండుగ శుభాకాంక్షలు



గుంటూరు : రాష్ట్ర ప్రజలు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. "సంక్రాంతి అంటేనే అచ్చ తెలుగు పండుగ. గ్రామానికి నూతన శోభను తెచ్చే పండుగ. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ. పల్లెల పండుగ.. రైతుల పండుగ.. మన పాడిపంటల పండుగ. తమ స్వగ్రామాలకు తిరిగి వెళ్ళి, తమ కుటుంబ, సాంస్కృతిక మూలాలకు విలువనిచ్చే పెద్ద పండుగ. భోగి మంటలు.. రంగ వల్లులు.. హరిదాసుల కీర్తనలు. గంగిరెద్దుల ఆటలు, గాలి పటాల సందళ్ళు, పైరు పచ్చల కళకళలు. రైతు లోగిళ్ళలో ధాన్యం రాసులు.. పిండి వంటల ఘుమఘుమలు. బంధు మిత్రుల సందళ్ళతో కనువిందు చేసే మనందరి పండుగ సంక్రాంతి. మనందరి ప్రభుత్వం ఈ 56 నెలల్లోనే ప్రతి గ్రామంలోనూ గ్రామ సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ లు, గవర్నమెంటు బడి, గవర్నమెంటు ఆసుపత్రిలో నాడు–నేడు, ఇంగ్లీషు మీడియం స్కూళ్ళు, బ్రాడ్ బ్యాండ్ సదుపాయంతో అక్కడే కడుతున్న డిజిటల్ లైబ్రరీలు, ఒక్క రూపాయి కూడా లంచం, వివక్ష లేకుండా ప్రజలకు అందిన రూ. 2.46 లక్షల కోట్ల డీబీటీ... ఇంటింటికీ, ప్రతి పేద సామాజికవర్గానికి చరిత్రలో ఎన్నడూలేనంతగా అందిన లబ్ధి...ఇవన్నీ పల్లెలు మళ్ళీ కళకళలాడేందుకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఇంటింటా, రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలోనూ, ప్రతి మారుమూల పల్లెలోనూ, ప్రతి ఒక్క సామాజికవర్గంలోనూ... నిన్నటి కంటే నేడు, నేటి కంటే రేపు, రేపటి కంటే భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించగలం అన్న భరోసా ఇవ్వగలిగితేనే ఇంటింటా సంక్రాంతి అని నమ్ముతూ ఆచరిస్తున్న ప్రభుత్వంగా... రాష్ట్ర ప్రజలందరికీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ మకర సంక్రాంతి శుభాకాంక్షలు" అని సీఎం జగన్ పేర్కొన్నారు.